క్లుప్తంగా

గ్రానైట్ లారీలు పట్టివేత



అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన లారీలు

చీమకుర్తి రూరల్: మైనింగ్ బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ ముడిరాళ్ల రవాణా చేస్తున్న లారీలు, గ్రానైట్ కంటైనర్ లను గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. రామతీర్థం ప్రాంతంలో మైనింగ్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేయగా 2 గ్రానైట్ ముడిరాళ్ల లారీలు, 3 కటింగ్ పీసుల లారీలను మైనింగ్ అధికారులు ఏపీఎండీసీ ప్రాంగణంలోకి తరలించారు.

కిశోర వికాసం, బంగారు బాల్యం పై సమీక్ష



కిశోర వికాసం, బంగారు బాల్యం పై వివరిస్తున్న గ్రామస్థాయి కమిటీ

సంతనూతలపాడు: సంతనూతలపాడు హైస్కూల్లో శుక్రవారం కిశోర వికాసం, బంగారు బాల్యం పై గ్రామస్థాయి కమిటీ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలికల లైంగిక వేధింపులు, ప్రేమ పేరుతో మోసాలు తదితర వాటిపై చర్యలు, తగు జాగ్రత్తల పై సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం. ఎస్.ఉమామహేశ్వరి, వీఆర్వో దాసరి శ్రీనివాసులు, అంగన్వాడీ టీచర్లు సీహెచ్ మరియమ్మ, ఎం నాగేంద్రం, అరుణ, అంజమ్మ, లక్ష్మి, మాధవీ లత తదితరులు పాల్గొన్నారు.

అపెక్స్‌లో మెగా వైద్య శిబిరం



వైద్యులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కరస్పాండెంట్ శివకోటిరెడ్డి

ఒంగోలు సిటీ: నగరంలోని సుజాతనగర్ అపెక్స్ హైస్కూల్లో ఫౌండర్ చైర్మన్, దివంగత మండాది శ్రీనివాసరెడ్డి జయంతి సందర్భంగా మెడిక్యూర్ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి తెలిపారు. వైద్యశిబిరంలో ఎముకలు కీళ్ల వైద్యనిపుణులు కె.శ్రీనాథ్, గుండె సంబంధిత వైద్య నిపుణులు కె.శ్రీధర్‌బాబు, గైనకాలజిస్టులు కె.జ్యోత్స్న, కె.రవళి, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు ఎం.సుస్మిత, అప్తమాలజిస్ట్ సీహెచ్ నరేంద్రవర్మ, ఫిజియోథెరపిస్ట్ నాగూర్‌బాబు, జనరల్ మెడిసన్ స్టీఫెన్ కిషోర్, హోమియోపతి వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రత్యూష వైద్య శిబిరంలో పాల్గొని 400 మందికి బీపీ, సుగర్, ఈసీజీ, కార్డియాలజీ, ఆర్థో, గైనిక్, సమస్యలకు సేవలందించారు. అనంతరం పరీక్షలు పూర్తయిన తర్వాత ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



దేవరపాలెం గ్రామంలో నిర్మించిన కూనంనేనివారిపాలెం, ఇతర గ్రామాలకు సమగ్ర రక్షిత మంచినీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు



నిరుపయోగంగా ఉన్న కె.వి.పాలెంలోని ఓవర్ హెడ్ ట్యాంకు, దిగువన నిర్మించిన సంపు

పేరుకే పథకం.. నీరుపయోగం

- కూనంనేనివారిపాలెం పేరుతో మంచి నీటి పథకం
- ఆ గ్రామానికే అందని జలాలు
- జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.40 లక్షలు ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- సమస్య పరిష్కరించి నీరివ్వాలని గ్రామస్తుల వేడుకోలు

చీమకుర్తి రూరల్: రామతీర్థం జలాశయం నుంచి చీమకుర్తి మండలంలోని సుమారు 25 గ్రామాలకు తాగునీరు సరఫరా అందించే పథకానికి కూనంనేనివారిపాలెం, ఇతర గ్రామాలకు సమగ్ర రక్షిత మంచి నీటి పథకంగా నామకరణం చేశారు. తీరా చూస్తే పథకం పేరున్న గ్రామానికే దశాబ్దకాలంగా తాగు నీరు అందడం లేదు. ముప్వావారిపాలెం నుంచి వేసిన పైపులైను దెబ్బతినడంతో సమస్య నెలకొంది. దీంతో గ్రామంలో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకు సైతం నిరుపయోగంగా మారింది. ఈ విషయమై స్థానిక ఎంపీటీసీ వేమా అశ్విని, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎప్పటికప్పుడు ప్రస్తావించడంతో పైపులైను మరమ్మతులు, ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద సంపు నిర్మాణాలకు జల్ జీవన్ మిషన్ కింద రూ.40 లక్షలు మంజూరు చేశారు. కొద్ది నెలల క్రితమే పనులు పూర్తయినా నేటికీ జలాలు మాత్రం రావడం లేదు. చీమకుర్తి మండలంలో తాగునీటి సమస్య తీర్చేందుకు అప్పటి ఎమ్మెల్యే దారా సాంబయ్య, ఎంపీపీ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చొరవతో ఈ రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేయించారు. జలయజ్ఞంలో భాగంగా రామతీర్థం జలాశయం నిర్మించి దాని ప్రారంభోత్సవానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2009లో చీమకుర్తి మండలం కేవీపాలెం, ఇతర గ్రామాలకు సమగ్ర రక్షిత మంచినీటి పథకం రూ.8 కోట్లతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు.

ఈ పథకం ద్వారా 25 గ్రామాలకు తాగునీరు..

రామతీర్థం జలాశయం నుంచి తాగునీరు దేవరపాలెం, చినరావిపాడు మీదుగా ముప్వావారిపాలెం, మర్రిపాలెం, గోనుగుంట, పుట్టచెరువుపాలెం, పిడతలపూడి వరకు పైపుల ద్వారా సరఫరా అవుతుంది. కానీ ముప్వావారిపాలెం నుంచి కూనంనేనివారిపాలెం గ్రామానికి తాగునీరు అందించే క్రమంలో ముప్వావారిపాలెం దగ్గర పైప్ లైన్ పగిలిపోవడం ద్వారా నీటి సరఫరాకు అంతరాయం కలిగింది.

మండల పరిషత్ నిధులు ఇస్తానన్న ఎంపీపీ:

గత నెల జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు తాగునీటి సమస్య లేవనెత్తగా.. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడారు. కేవీ పాలెం గ్రామానికి మంచినీటి సరఫరా సమస్య పరిష్కారానికి మండల ప్రజా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి నీరందించాలని ఏఈ శాంతిప్రియని ఆదేశించారు. అధికారులు స్పందించి సత్వరం పనులు పూర్తిచేసి నీరివ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటర్మీడియెట్ సంపు నిర్మించాలి

కేవీ పాలెం సంపునకు తాగునీరు సరఫరా చేయాలంటే ముప్వావారిపాలెంలో ఇంటర్మీడియెట్ సంపు నిర్మించి అధిక సామర్థ్యం ఉన్న మోటారు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. ఫిబ్రవరి మొదటి వారానికల్లా కె.వి.పాలెం గ్రామానికి నీరందే అవకాశం ఉంది.

– ఏఈ శాంతిప్రియ, చీమకుర్తి గ్రామీణ నీటి సరఫరా విభాగం

అధికారుల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి



సంవత్సరాలు మారుతున్నా చీమకుర్తి మండల ప్రజలకు నీటి కష్టాలు తీరడం లేదు. రామతీర్థం జలాశయం పక్కనే ఉన్నా.. మా కుళాయిలకు నీరు రావడం లేదు. మా గొంతులు తడపడం లేదు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలి.

– వేమా అశ్విని సురేష్, ఎంపీటీసీ, కూనంనేనివారిపాలెం

చిన్న చిన్న లోటు పాట్లు సరిచేయండి



జల్‌జీవన్ మిషన్ కింద రూ.40 లక్షలు ఖర్చు చేసినా గ్రామీణ గొంతులకు రక్షిత జలాలు అందడం లేదు. చిన్నచిన్న లోటు పాట్లు సరిచేయకపోవడంతో ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతూనే ఉంది. మరోవైపు ఆయా పథకాలకు అనుబంధంగా నిర్మించిన ట్యాంకులు సైతం నిరుపయోగంగా మారాయి. ఆ సమస్యలను పరిష్కరించి గ్రామానికి తాగునీరు అందించాలి.

– ఎర్రగుంట్ల మోహన్, కూనంనేనివారిపాలెం

కిడ్నీ సమస్యలు కూడా ఎక్కువే



మా గ్రామంలో మంచినీటి సమస్య ఉంది. బోరింగ్ నీళ్లు తాగుతుండటంతో కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. మా గ్రామంలో తాగునీటి సమస్య త్వరగా పరిష్కరించండి.

– వేమా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ, కూనంనేనివారిపాలెం

సమస్య త్వరగా పరిష్కరించాలి



రామతీర్థం జలాశయం ప్రారంభోత్సవం రోజే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చీమకుర్తి మండలంలో కేవీ పాలెం, ఇతర గ్రామాలకు సమగ్ర రక్షిత మంచినీటి పథకం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. కానీ ఇన్ని సంవత్సరాల గడిచిపోయినా పథకం పేరున్న ఊరికి తాగునీరు అందకపోవడం బాధాకరం. సంబంధిత అధికారులు ఈ సమస్యను త్వరగా పరిష్కరించి ప్రజలకు తాగునీరు అందించాలి.

– పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ తో విద్యార్థులు

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చీమకుర్తి బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షల్లో బాగా రాణించాలని బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరఫున వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్.ఎం. డీవీఎల్ నరసింహారావు, పీడీ కే.వనజ, ఉపాధ్యాయులు ఓబుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



మైలవరం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య

మద్దిపాడు: రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ వర కుమార్ అన్నారు. ఏడుగుండ్లపాడు, వెంకట్రాజుపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సులో సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఉన్న ఫైళ్ల విషయంలో తహసీల్దార్ ఉన్నతాధికారుల సూచనల మేరకు పరిష్కరిస్తారన్నారు. మండలంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ముగిశాయన్నారు. వీటిలో చాలా వరకు రీ సర్వే, మ్యుటేషన్, దేవదాయ శాఖ కు చెందిన భూములు, పొలం ఆన్‌లైన్ చేయడానికి అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట సుజన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అజయ్ కుమార్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్ బాబు, శిల్ప సౌందర్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

చీమకుర్తి రూరల్: మండలంలోని పులికొండ సచివాలయ పరిధిలో మైలవరం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 4 అర్జీలు వచ్చాయని మండల రెవెన్యూ అధికారి ఆర్ బ్రహ్మయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 8వ తేదీ వరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని, ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సుకు 4 అర్జీలు వచ్చాయని ఈ అర్జీల ఆన్ లైన్ కు, భూమి కొలతలు సర్వే చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి కోరారు. మండలంలోని చిలకపాడు సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ బొలినేని కోమలి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ఇటీవలే గ్రామంలో రీ సర్వే నిర్వహించడంతో భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి అర్జీలు బాగా తక్కువ వచ్చాయన్నారు. ఈ సదస్సులో మొత్తం 5 అర్జీలు నమోదయ్యాయి. వాటిలో మూడు అర్జీలు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం, మిగిలిన రెండు దరఖాస్తులు సర్వేకు సంబంధించి రైతులు నుంచి వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే మాబు సుభాని, కొంకా చిన్నారావు, బొలినేని మధుసూదన్ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.రామ్ తేజ్, వీఆర్వో కె. హనుమంత రావు, సర్వేయర్ బి.హరి, కంప్యూటర్ ఆపరేటర్ ఐ.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ రావు, మండల రెవెన్యూ సదస్సుల ఎండోమెంట్ ఇన్‌చార్జ్ మద్దినేని శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సావిత్రిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సావిత్రిబా పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీటీఏ నాయకులు



సావిత్రిబాపూలేకు నివాళులర్పిస్తున్న మహిళాభ్యుదయ సమితి సభ్యులు

సావిత్రిబా పూలే సేవలు మరువరానివి

సంతనూతలపాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబా పూలే జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు నల్లూరి ఉమామహేశ్వరి పాల్గొని మాట్లాడారు. జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబా పూలే రచయిత్రిగా, ఉపాధ్యాయురాలుగా, సమాజంలో భాగమై ఉన్న మహిళలు, నిమ్న వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. సావిత్రిబా పూలే చిత్రపటానికి ఇన్‌చార్జి హెచ్ఎం ఉమామహేశ్వరి, పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఆళ్ల చెరువు ధనలక్ష్మి, ఎస్ఎంసీ సభ్యులు పావులూరి నారాయణస్వామి చౌదరి, హైస్కూల్ స్టాఫ్ సెక్రటరీ మాధవీలత, ఉపాధ్యాయులు ఫణి పద్మ, సుబ్బారావు, టీడీపీ నాయకులు ముప్పరాజు శ్రీనివాసరావు, మార్పుడి జనార్దన్, మందాడి వెంకటేశ్వర్లు, ఎస్.మాధవి లత పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో ఘనంగా సావిత్రిబా జయంతి వేడుకలు

సంతనూతలపాడు లోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం సావిత్రిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల వెలుగు ఏపీఎం బాబురావు తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ధిక్కార పతాకాన్ని ఎగరేసిన సావిత్రిబా పూలే

ఒంగోలు టౌన్: మూఢ నమ్మకాలు, ఛాందస భావాలకు వ్యతిరేకంగా ధిక్కార పతాకాన్ని ఎగరేసిన సావిత్రిబా పూలే నేటి తరాలకు ఆదర్శంగా నిలిచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మల్లయ్యలింగం భవనంలో చదువులతల్లి సావిత్రిబా జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గుజ్జుల మాట్లాడుతూ ఎన్నో అవమానాలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడదాకా పోరాటిన సావిత్రిబా చేసిన సాహసం వల్లే నేడు మహిళలకు విద్యావకాశాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ సావిత్రిబా జీవితాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని, ఆమె చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల క్రితమే ఒంటరి మహిళలకు పెళ్లిళ్లు చేసి చరిత్రలో నిలిచారని చెప్పారు. జాతీయ స్థాయిలో జనవరి 3వ తేదీన జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వీరారెడ్డి, హనుమారెడ్డి, ఎంఏ సాలార్, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరాం శ్రీనివాసులు, ఎం.వెంకయ్య, ఆర్.వెంకటరావు పాల్గొన్నారు.

మనువాదాన్ని తిప్పికొట్టిన ధైర్యశాలి: సీపీఎం

మనువాదాన్ని కాలిగోటితో తిప్పి కొట్టిన ధైర్యశాలి సావిత్రిబా మహిళల విద్య కోసం ఎన్నో అవమానాలను, ఛీత్కారాలను భరించారని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. ఎల్బీజీ భవనంలో సావిత్రిబా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్యాగం, క్రమశిక్షణకు మారుపేరుగా జ్యోతిరావు పూలే, సావిత్రిబా పూలేలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. శూద్రులు విద్య నేర్చుకోవడమే సహజమైన హక్కని, అందరూ చదవాలని సావిత్రిబా బోధించారని తెలిపారు. కుల వివక్షకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని చెప్పారు. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కేంద్రంలోని పాలకులు వ్యూహాత్మకంగా మతచిచ్చు పెడుతున్నారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ డీఈ సుధీర్‌బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్, బాలకోటయ్య, నారాయణ, మోజేష్ పాల్గొన్నారు.

మహిళల్లో మణిపూస సావిత్రిబా పూలే

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తి సదనంలో సావిత్రిబాపూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షురాలు బీరం అరుణ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా తేళ్ల అరుణ హాజరయ్యారు. కొత్తపట్నం మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, నరసం జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, వార్డెన్, సూపరింటెండెంట్ తమ్మిశెట్టి రమాదేవి, లైజన్ ఆఫీసర్ కె.శాంతిలత, గుంటుపల్లి శ్రీదేవి, సీహెచ్ కనకదుర్గ, మలాన్‌భాను, పి.నాగేంద్రమ్మ పాల్గొని సావిత్రిబాపూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

కొత్తపట్నం: సావిత్రిబా పూలే ఉపాధ్యాయులకు ఆదర్శమని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని ఎంఈవో 1, 2 తులసికుమారి, పద్మావతి అన్నారు. స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత బహుజన టీచర్స్ డైరీలు, 2025 క్యాలెండర్లు ఎంఈఓలు, హెచ్ఎం మన్నం శ్రీదేవిలు ఆవిష్కరించారు. తులసీకుమారి, పద్మావతి, శ్రీదేవిలను ఘనంగా సన్మానించారు. కొత్తపట్నం మండల బీటీఏ నాయకులు మద్దిరాల శరత్‌చంద్రబాబు, కర్రా దేవసహాయం, పల్లె కృష్ణమూర్తి, నన్నేసాని భాస్కర్‌రావు, కొప్పోలు కిషోర్, తెలగతోటి సంధ్యారాణి, ధనజ్యోతి, అత్తులూరి నాగమల్లేశ్వరరావు, మన్నం వసుంధర, మైనం సుజాత, సునీత, కాజమ్మ, కాకి రజనీకుమారి, ఎల్చూరి నీల పాల్గొన్నారు.

ఒంగోలు సిటీ: సావిత్రిబా పూలే జయంతి సందర్భంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని ఎలక్ట్రికల్ ఆఫీస్ వద్ద ఉన్న క్రాంతి జ్యోతి సావిత్రిబా పూలే విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ సావిత్రిబా పూలే జీవితం ప్రతి ఉపాధ్యాయునికి ఆదర్శమని, తన జీవితాన్ని పేదల విద్యాభివృద్ధి కోసం త్యాగం చేశారన్నారు. ఉపాధ్యాయులు ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ సావిత్రిబా పూలే, మహాత్మా జ్యోతిరావు పూలేలకు చరిత్రలో సరైన స్థానం లభించలేదని, వారి జీవితాలను పూర్తిస్థాయిలో పుస్తకాల్లో ముద్రించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారా బత్తిన జాలరామయ్య, రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్‌చంద్రబాబు, జిల్లా నాయకులు కర్రా దేవ సహాయం, పల్లె కృష్ణమూర్తి, కొండమూరి కొండలరాయుడు, ఏల్చూరి భాగ్యం, గాలిమోటు భాస్కరరావు, నన్నేసాని భాస్కరరావు, బొంత కళ్యాణ్, మద్దిరాల వీరనారాయణ పాల్గొన్నారు.



సావిత్రిబాపూలే జయంతిని చేస్తున్న సీపీఐ నాయకులు



ఎల్బీజీ భవనంలో సావిత్రిబాపూలే జయంతి



ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సచ్చిదానందను సీఎం కలవడం తగనిపని

ఒంగోలు వన్‌టౌన్: హైటెక్ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న చంద్రబాబు గణపతి సచ్చిదానందగా పిలవబడే సత్యనారాయణను కలవడం తగని పని అని భారత హేదువాద సంఘ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సత్యనారాయణ గతంలో పోస్టుమెన్‌గా పని చేస్తూ పోలీసు కేసు కావడంతో ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. గణపతి ఆశ్రమానికి పక్కనే ఉన్న సర్వే నంబర్ 106,2లోని భూమి ఒక వైద్యుడిదని, స్వామి ఆక్రమించాడన్నారు. ఈ కేసులో 2008లోనే స్వామిని పోలీసులు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు.

అక్రమ తవ్వకాల పరిశీలన

సింగరాయకొండ: మండలంలోని పాత సింగరాయకొండ, శానంపూడి గ్రామాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని, అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మండల ప్రజలు గత సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ అన్సారియా ఆదేశాలతో మైనింగ్, రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలను శుక్రవారం పరిశీలించి ఏ మేరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందో తెలుసుకునేందుకు కొలతలు కూడా తీసుకున్నారు. అక్రమ మైనింగ్ జరగకుండా అడ్డుకుంటామని, అక్రమార్కులపై భారీగా జరిమానా విధించనున్నట్లు మైనింగ్ అధికారులు తెలిపారని స్థానికులు పేర్కొన్నారు. మైనింగ్ శాఖ ఆర్ఐ సురేష్‌బాబు, టెక్నికల్ అధికారి రాజీనాయుడు, ఆర్ఐ శివప్ప, వీఆర్ఓ తిరుమల, సింహాద్రి, సర్వేయర్లు సాయి, పవన్ పాల్గొన్నారు.